17-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రి మెడలోని హారముగా అయ్యేందుకు జ్ఞాన-యోగాల రేస్ చేయండి, మీ కర్తవ్యము - మొత్తం ప్రపంచమంతటికీ తండ్రి పరిచయాన్ని ఇవ్వడము"

ప్రశ్న:- ఏ ఆనందములో సదా ఉన్నట్లయితే అనారోగ్యము కూడా నయమవుతూ ఉంటుంది?

జవాబు:- జ్ఞాన-యోగాల ఆనందములో ఉండండి, ఈ పాత శరీరం గురించి ఆలోచించకండి. ఎంతగా శరీరము వైపుకు బుద్ధి వెళ్తుందో, లోభము పెట్టుకుంటారో, అంతగా వ్యాధులు ఇంకా వస్తూ ఉంటాయి. ఈ శరీరాన్ని అలంకరించుకోవడము, పౌడర్, క్రీమ్ మొదలైనవి రాసుకోవడము - ఇదంతా అనవసరమైన అలంకరణ. మీరు స్వయాన్ని జ్ఞాన-యోగాలతో అలంకరించుకోవాలి. ఇదే మీ సత్యాతి-సత్యమైన అలంకరణ.

పాట:- ఎవరైతే తండ్రితో ఉన్నారో... (జో పియా కే సాథ్ హై...)

ఓం శాంతి. ఎవరైతే తండ్రితో పాటు ఉన్నారో..., ఇప్పుడు ప్రపంచంలో తండ్రులైతే ఎంతోమంది ఉన్నారు కానీ వారందరికీ తండ్రి, రచయిత ఒక్కరే. వారే జ్ఞానసాగరుడు. పరమపిత పరమాత్మ జ్ఞానసాగరుడని, జ్ఞానం ద్వారానే సద్గతి లభిస్తుందని తప్పకుండా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఎప్పుడైతే సత్యయుగ స్థాపన జరుగుతుందో అప్పుడే మనుష్యుల సద్గతి జరుగుతుంది. తండ్రినే సద్గతిదాత అని అంటారు. ఎప్పుడైతే సంగమ సమయం వస్తుందో అప్పుడే జ్ఞానసాగరుడు వచ్చి దుర్గతి నుండి సద్గతిలోకి తీసుకువెళ్తారు. అన్నింటికన్నా ప్రాచీనమైనది భారత్. భారతవాసులు పేరు మీదే 84 జన్మలు గానం చేయబడ్డాయి. తప్పకుండా ఏ మనుష్యులైతే మొట్టమొదట ఉండి ఉంటారో వారే 84 జన్మలు తీసుకుంటూ ఉండవచ్చు. దేవతలకు 84 జన్మలు అని అన్నట్లయితే మరి బ్రాహ్మణులకు కూడా 84 జన్మలు ఉంటాయి. ముఖ్యమైనవారి గురించే ప్రస్తావించడం జరుగుతుంది. ఈ విషయాల గురించి ఎవ్వరికీ తెలియదు. తప్పకుండా బ్రహ్మా ద్వారానే సృష్టిని రచిస్తారు. మొట్టమొదట సూక్ష్మలోకాన్ని రచించాలి, ఆ తర్వాత ఈ స్థూలలోకము. సూక్ష్మలోకము ఎక్కడ ఉంది, మూలలోకము ఎక్కడ ఉంది అనేది పిల్లలకు తెలుసు. మూలవతనము, సూక్ష్మవతనము, స్థూలవతనము - వీటినే మూడు లోకాలు అని అంటారు. త్రిలోకనాథుడు అని అన్నప్పుడు మరి దానికి అర్థం కూడా ఉండాలి కదా. ఏవో మూడు లోకాలైతే ఉంటాయి కదా. వాస్తవానికి త్రిలోకనాథుడు అని ఒక్క తండ్రినే అనవచ్చు మరియు వారి పిల్లలనే అనవచ్చు. ఇక్కడైతే అనేకమంది మనుష్యులకు త్రిలోకనాథ్, శివ, బ్రహ్మా, విష్ణు, శంకర్ మొదలైన పేర్లు ఉన్నాయి... ఈ పేర్లన్నింటినీ భారతవాసులు తమకు తాము పెట్టుకున్నారు. రాధా-కృష్ణ, లక్ష్మీ-నారాయణ అని డబుల్ పేర్లు కూడా పెట్టుకుంటారు. రాధ మరియు కృష్ణుడు వేరు-వేరుగా ఉండేవారని ఎవ్వరికీ తెలియదు. అతను ఒక రాజ్యానికి యువరాజుగా ఉండేవారు, ఆమె వేరే రాజ్యానికి యువరాణిగా ఉండేవారు. ఈ విషయాలు ఇప్పుడు మీకు తెలుసు. మంచి-మంచి పిల్లలు ఎవరైతే ఉన్నారో, వారి బుద్ధిలో మంచి-మంచి పాయింట్లు ధారణ అవుతాయి. ఏ విధంగానైతే మంచి తెలివైన డాక్టర్ వద్ద అనేక రకాల మందుల పేర్లు ఉంటాయో, అలా ఇక్కడ కూడా ఈ కొత్త-కొత్త పాయింట్లు ఎన్నో వెలువడుతూ ఉంటాయి. రోజు-రోజుకు ఇన్వెన్షన్లు జరుగుతూ ఉంటాయి. ఎవరికైతే మంచి ప్రాక్టీస్ ఉంటుందో వారు కొత్త-కొత్త పాయింట్లను ధారణ చేస్తూ ఉంటారు. ధారణ చేయకపోతే మహారథుల లైన్ లోకి తీసుకురాలేము. మొత్తం ఆధారమంతా బుద్ధిపై ఉంది మరియు భాగ్యము యొక్క విషయం కూడా ఉంది. ఇది కూడా డ్రామాలో ఉంది కదా. డ్రామా గురించి కూడా ఎవ్వరికీ తెలియదు. మేము కర్మక్షేత్రములో పాత్రను అభినయిస్తున్నాము - అని కూడా భావిస్తారు. కానీ డ్రామా యొక్క ఆదిమధ్యాంతాల గురించి తెలియకపోతే ఇంకేమీ తెలియనట్లే. మీకైతే అన్ని విషయాల గురించి తెలియాలి.

తండ్రి వచ్చారని పిల్లలకు తెలిసినప్పుడు, పిల్లల కర్తవ్యము ఇతరులకు కూడా పరిచయాన్ని ఇవ్వడము. మొత్తం ప్రపంచమంతటికీ తెలియజేయడం పిల్లల కర్తవ్యము. ఇక తర్వాత ఎవ్వరూ మాకు తెలియదని అనకూడదు. మీ వద్దకు ఎంతోమంది వస్తారు. లిటరేచర్ మొదలైనవి ఎన్నో తీసుకుంటారు.

పిల్లలు ప్రారంభంలో సాక్షాత్కారాలు కూడా ఎన్నో చూసారు. ఈ క్రైస్టు, ఇబ్రహీం భారత్ లోకి వస్తారు. తప్పకుండా భారత్ అందరినీ ఆకర్షిస్తూ ఉంటుంది. వాస్తవానికి భారత్ యే అనంతమైన తండ్రి యొక్క జన్మస్థానము కదా. కానీ వారికి - ఈ భారత్ భగవంతుని జన్మస్థానము అని ఈ మాత్రం కూడా తెలియదు. శివ పరమాత్మ అని అంటారు కూడా, కానీ

అందరినీ పరమాత్మ అని అనేసరికి అనంతమైన తండ్రి యొక్క మహత్యాన్ని మాయం చేసేసారు. ఇప్పుడు పిల్లలైన మీరు అర్థం చేయిస్తారు - భారత ఖండం అన్నింటికన్నా గొప్ప తీర్థస్థానము. ఇకపోతే మిగిలిన సందేశకులు మొదలైనవారు ఎవరైతే వస్తారో, వారు తమ-తమ ధర్మాలను స్థాపన చేసేందుకే వస్తారు. వారి వెనుక ఇక అన్ని ధర్మాలవారు వస్తూ ఉంటారు. ఇప్పుడిది అంతిమము. తిరిగి వెళ్ళాలి అని ప్రయత్నిస్తారు. కానీ మిమ్మల్ని ఇక్కడకు తీసుకువచ్చింది ఎవరు? క్రైస్టు వచ్చి క్రిస్టియన్ ధర్మాన్ని స్థాపన చేసారు, అతను మిమ్మల్ని ఇక్కడికి ఆకర్షించారు. ఇప్పుడు అందరూ విసిగిపోయారు, అందుకే తిరిగి వెళ్ళాలనుకుంటున్నారు. అందరూ తమ-తమ పాత్రను అభినయించేందుకు వస్తారు అని ఈ విషయాన్ని మీరు అర్థం చేయించాలి. పాత్రను అభినయిస్తూ-అభినయిస్తూ దుఃఖములోకి రావలసిందే, తర్వాత ఆ దుఃఖము నుండి విడిపించి సుఖములోకి తీసుకువెళ్ళడమనేది తండ్రి పనే. తండ్రి యొక్క జన్మస్థానము భారత్, ఇంతటి మహత్వము గురించి పిల్లలైన మీలో కూడా అందరికీ తెలియదు. అర్థం చేసుకున్నవారు మరియు నషా ఎక్కి ఉన్నవారు కొందరే ఉన్నారు. కల్ప-కల్పమూ తండ్రి భారత్ లోకే వస్తారు, ఈ విషయాన్ని అందరికీ తెలియజేయాలి. ఆహ్వానాన్ని ఇవ్వాలి. మొదటైతే ఈ సేవను చేయాల్సి ఉంటుంది. లిటరేచర్ ను తయారుచేయాల్సి ఉంటుంది. ఆహ్వానమైతే అందరికీ ఇవ్వాలి కదా. రచయిత మరియు రచన యొక్క జ్ఞానము గురించి ఎవ్వరికీ తెలియదు. సేవాధారులుగా అయి తమ పేరును ప్రఖ్యాతము చేయాలి. చురుకైన పిల్లలెవరైతే ఉన్నారో, వారి బుద్ధిలో ఎన్నో పాయింట్లు ఉంటాయి, వారి సహాయాన్ని అందరూ కోరుకుంటారు. వారి పేరునే జపిస్తూ ఉంటారు. ఒకటేమో శివబాబాను జపిస్తారు, ఆ తర్వాత బ్రహ్మాబాబాను, ఆ తర్వాత నంబరువారుగా పిల్లలను జపిస్తారు. భక్తి మార్గంలో చేతితో మాలను తిప్పుతారు. ఇప్పుడేమో - ఫలానావారు చాలా మంచి సేవాధారులు, నిరహంకారులు, చాలా మధురమైనవారు, వారికి దేహాభిమానం లేదు అంటూ నోటితో పేరును జపిస్తారు. మీరు మధురముగా తయారైనట్లయితే అందరూ మధురముగా వ్యవహరిస్తారని అంటారు కదా. తండ్రి అంటారు - మీరు దుఃఖితులుగా అయిపోయారు, ఇప్పుడు పిల్లలైన మీరు నన్ను స్మృతి చేసినట్లయితే నేను కూడా సహాయం చేస్తాను. మీలో ద్వేషము ఉన్నట్లయితే నేనేమి చేస్తాను. అలా చేస్తే స్వయాన్నే ద్వేషించుకున్నట్లు అవుతుంది, పదవి లభించదు. ధనము ఎంత అపారంగా లభిస్తుంది. ఎవరికైనా లాటరీ లభిస్తే ఎంత సంతోషిస్తారు. అక్కడ కూడా ఎన్ని కానుకలు వస్తాయి. ఫస్ట్ ప్రైజ్, సెకండ్ ప్రైజ్, థర్డ్ ప్రైజ్ లు ఉంటాయి. ఖచ్చితంగా ఇది కూడా ఈశ్వరీయ రేస్. జ్ఞానబలము మరియు యోగబలము యొక్క రేస్. ఎవరైతే ఇందులో చురుకుగా వెళ్తారో, వారే మెడలోని హారంగా అవుతారు మరియు సింహాసనముపై సమీపముగా కూర్చుంటారు. చాలా సహజముగా అర్థం చేయించడం జరుగుతుంది. మీ ఇంటిని కూడా సంభాళించండి, ఎందుకంటే మీరు కర్మయోగులు. క్లాసులో ఒక గంట చదువుకోవాలి, తర్వాత ఇంటికి వెళ్ళి దానిపై ఆలోచించాలి. స్కూల్లో కూడా ఈ విధంగానే చేస్తారు కదా. చదువుకొని మళ్ళీ ఇంటికి వెళ్ళి హోంవర్క్ చేస్తారు. తండ్రి అంటారు, ఒక ఘడియ, అర్ధ ఘడియ... ఇలా రోజులో 8 ఘడియలు ఉంటాయి. అందులో ఒక ఘడియ అయినా, అచ్ఛా, అర్ధ ఘడియ అయినా స్మృతి చేయండి అని తండ్రి అంటారు. 15-20 నిమిషాలైనా క్లాసుకు హాజరై, ధారణ చేసి, ఆ తర్వాత మీ వ్యాపార, వ్యవహారాలలో నిమగ్నమవ్వండి. ఇంతకుముందు బాబా స్మృతిలో కూర్చోండి, స్వదర్శన చక్రాన్ని తిప్పండి అంటూ మిమ్మల్ని కూర్చోబెట్టేవారు కూడా. స్మృతి అన్న పదమైతే ఉండేది కదా. తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేస్తూ-చేస్తూ, స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ-తిప్పుతూ నిద్ర వస్తుందని అనిపించనప్పుడు పడుకోండి. అప్పుడిక అంతిమ మతిని బట్టి గతి ఏర్పడుతుంది. మళ్ళీ ఉదయం లేచేటప్పుడు అవే పాయింట్లు గుర్తుకొస్తాయి. ఈ విధంగా అభ్యాసం చేస్తూ-చేస్తూ మీరు నిద్రను జయించేవారిగా అవుతారు.

ఎవరు చేస్తారో వారే పొందుతారు. చేసేవారిది కనిపిస్తుంది. వారి నడవడిక ప్రత్యక్షమవుతుంది. చేయనివారి యొక్క నడవడిక వేరుగా ఉంటుంది. ఈ పిల్లలు విచార సాగర మంథనము చేస్తున్నారు, ధారణ చేస్తున్నారు, లోభము మొదలైనవేవీ లేవు కదా అన్నది గమనించడం జరుగుతుంది. ఇది పాత శరీరము. ఎప్పుడైతే జ్ఞాన-యోగాల ధారణ జరుగుతుందో, అప్పుడే ఈ శరీరము కూడా బాగుంటుంది. ధారణ లేకపోతే శరీరము ఇంకా పాడైపోతూ ఉంటుంది. కొత్త శరీరము భవిష్యత్తులో లభించనున్నది. ఆత్మను శుద్ధముగా తయారుచేసుకోవాలి. ఇది పాత శరీరము, దీనికి పౌడర్లు, లిప్ స్టిక్లు మొదలైనవి ఎంతగా రాసినా, అలంకరణ చేసినా, ఇది పైసకు కొరగానిదే. ఈ అలంకరణ అంతా వ్యర్థమైనది.

ఇప్పుడు మీ అందరి నిశ్చితార్థము శివబాబాతో జరిగింది. వివాహం జరిగేటప్పుడు, ఆ రోజు పాత వస్త్రాలను ధరిస్తారు. ఇప్పుడు ఈ శరీరాన్ని అలంకరించకూడదు. జ్ఞాన-యోగాలతో స్వయాన్ని అలంకరించుకున్నట్లయితే మళ్ళీ భవిష్యత్తులో యువరాజులుగా, యువరాణులుగా అవుతారు. ఇది జ్ఞాన మానస సరోవరము. దీనిలో మునకలు వేస్తూ ఉన్నట్లయితే స్వర్గపు దేవకన్యలుగా అవుతారు. ప్రజలను దేవకన్యలు అని అనరు. శ్రీకృష్ణుడు ఎత్తుకుపోయారని,

మహారాణులుగా, పట్టపురాణులుగా చేసుకున్నారని అంటారు. అంతేకానీ ఎత్తుకుపోయి ప్రజలలో చండాలులు మొదలైనవారిగా చేసారనైతే అనరు. మహారాజు, మహారాణులుగా తయారుచేసేందుకనే ఎత్తుకుపోయారు. మీరు కూడా ఈ పురుషార్థం చేయాలి. ఏ పదవి లభించినా పర్వాలేదు... అని భావించడం కాదు. ఇక్కడ ముఖ్యమైనది చదువు. ఇది పాఠశాల కదా. గీతా పాఠశాలలు ఎన్నో తెరుస్తారు. అక్కడ కూర్చొని కేవలం గీతను వినిపిస్తారు, కంఠస్థం చేయిస్తారు. ఏదైనా ఒక శ్లోకాన్ని తీసుకుని అరగంట, ముప్పావుగంట దాని గురించి చెప్తూ ఉంటారు. దీని వలన లాభమేమీ లేదు. ఇక్కడైతే తండ్రే కూర్చొని చదివిస్తారు. లక్ష్యము-ఉద్దేశ్యము స్పష్టముగా ఉంది. ఇంకే వేద-శాస్త్రాలను చదవడం, జప-తపాదులు మొదలైనవి చేయడంలో లక్ష్యము-ఉద్దేశ్యము ఏమీ లేదు. అక్కడ అలా పురుషార్థం చేస్తూ ఉంటారు కానీ ఏమి లభిస్తుంది? ఎప్పుడైతే చాలా భక్తి చేస్తారో, అప్పుడే భగవంతుడు లభిస్తారు. అందులోనూ రాత్రి తర్వాత పగలు తప్పకుండా వస్తుంది. సమయానికి అలా జరిగిపోతుంది కదా. కల్పము యొక్క ఆయువును ఒక్కొక్కరు ఒక్కోలా చెప్తారు. వారికి అర్థం చేయిస్తే శాస్త్రాలు అసత్యమెలా అవ్వగలవు? అని అంటారు. భగవంతుడు అసత్యం చెప్తారా? కేవలం అర్థం చేయించేందుకు శక్తి కావాలి.

పిల్లలైన మీలో యోగబలము కావాలి. యోగబలము ద్వారా అన్ని పనులూ సహజముగా అయిపోతాయి. ఏ పనినైనా చేయలేకపోతున్నారంటే శక్తి లేనట్లే, యోగము లేనట్లే. అక్కడక్కడా బాబా కూడా సహాయం చేస్తారు. డ్రామాలో ఏది రచింపబడి ఉంటే అది రిపీట్ అవుతుంది. ఇది కూడా మనమే అర్థం చేసుకుంటాము, ఇంకెవ్వరూ డ్రామాను అర్థం చేసుకోరు. క్షణ-క్షణమూ ఏదైతే గతిస్తూ ఉంటుందో, అది గడియారపు ముల్లులా టిక్-టిక్ అని గడుస్తూ ఉంటుంది. మనం శ్రీమతమనుసారముగా కర్మల్లోకి వస్తాము. శ్రీమతముపై నడవకపోతే శ్రేష్ఠముగా ఎలా అవుతారు. అందరూ ఒకేలా అవ్వలేరు. మనమంతా ఒక్కటైపోవాలి అని ఇక్కడివారు భావిస్తారు. కానీ ఒక్కటిగా అవ్వడము యొక్క అర్థాన్ని అర్థం చేసుకోరు. ఏ విషయంలో ఒక్కటిగా అవ్వాలి? అందరూ ఒక్క తండ్రిగా అయిపోవాలా లేక ఒక్క సోదరునిగా అయిపోవాలా? సోదరులుగా అవ్వాలి అంటే కరక్టే. శ్రీమతముపై తప్పకుండా మనం ఒక్కటిగా అవ్వగలము. మీరందరూ ఒకే మతముపై నడుస్తారు. మీ తండ్రి, శిక్షకుడు, గురువు ఒక్కరే. ఎవరైతే పూర్తిగా శ్రీమతముపై నడవరో వారు శ్రేష్ఠముగా కూడా అవ్వరు. అస్సలు నడవకపోతే ఇక అంతమైపోతారు. ఎవరైతే యోగ్యులుగా ఉంటారో, వారినే రేస్ లోకి తీసుకువస్తారు. ఏదైనా పెద్ద రేస్ జరిగినప్పుడు మంచి ఫస్ట్ క్లాస్ అయిన గుర్రాలనే తీసుకువస్తారు, ఎందుకంటే అందులో లాటరీ కూడా పెద్దమొత్తంలో పెడతారు. అలాగే ఇది కూడా అశ్వాల రేస్. హుస్సేన్ యొక్క గుర్రము అని అంటారు కదా. వారు హుస్సేన్ ను గుర్రముపై యుద్ధం చేస్తున్నట్లుగా చూపించారు. ఇప్పుడు పిల్లలైన మీరైతే డబుల్ అహింసకులు. కామము యొక్క హింస నంబర్ వన్ అయినది. ఈ హింస గురించి ఎవ్వరికీ తెలియదు. సన్యాసులు కూడా అలా భావించరు. కేవలం వాటిని వికారాలు అని అంటారు. తండ్రి అంటారు - కామము మహాశత్రువు, ఇదే ఆదిమధ్యాంతాలు మీకు దుఃఖాన్ని ఇస్తుంది. మీరు నిరూపించి చెప్పాలి - మాది ప్రవృత్తిమార్గపు రాజయోగము, మీది హఠయోగము, మీరు శంకరాచార్యుని నుండి హఠయోగాన్ని నేర్చుకుంటారు, మేము శివాచార్యుని నుండి రాజయోగాన్ని నేర్చుకుంటాము. ఇటువంటి విషయాలను సమయానికి వినిపించాలి.

దేవతలకు 84 జన్మలు ఉన్నట్లయితే, మరి ఈ క్రిస్టియన్లు మొదలైనవారికి ఎన్ని జన్మలు ఉంటాయి అని మిమ్మల్ని ఎవరైనా అడిగితే, మీరు చెప్పండి - మీరే లెక్కపెట్టండి కదా, 5000 సంవత్సరాలలో 84 జన్మలు ఉంటాయి, క్రైస్టు వచ్చి 2000 సంవత్సరాలు అయ్యింది, కావున సగటున ఎన్ని జన్మలు ఉంటాయో లెక్కపెట్టండి. 30-32 జన్మలు ఉంటాయి. ఇది స్పష్టముగా ఉంది. ఎవరైతే చాలా సుఖాన్ని చూస్తారో, వారు దుఃఖాన్ని కూడా ఎంతో చూస్తారు. వారికైతే తక్కువ సుఖము, అలాగే తక్కువ దుఃఖము లభిస్తాయి. సగటున లెక్కవేయాలి. చివరిలో ఎవరైతే వస్తారో వారు కొన్ని-కొన్ని జన్మలే తీసుకుంటారు. బుద్ధుడు, ఇబ్రహీం మొదలైనవారి లెక్కను కూడా తీయవచ్చు. మహా అయితే ఒకటి, రెండు జన్మల తేడా వస్తుంది. ఈ విషయాలన్నింటినీ విచార సాగర మంథనము చేయాలి. ఎవరైనా అడిగితే ఏమి చెప్తారు? ఇలా చెప్పండి - మొదట అయితే తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోవాలి కదా, ముందు మీరు తండ్రిని స్మృతి చేయండి, ఎన్ని జన్మలు తీసుకోవాల్సి ఉంటే అన్ని జన్మలు తీసుకుంటారు, తండ్రి నుండైతే వారసత్వాన్ని తీసుకోండి. బాగా అర్థం చేయించాలి. ఇది శ్రమతో కూడుకున్న విషయము. శ్రమించడం ద్వారానే సఫలత పొందుతారు. ఇందులో చాలా విశాలబుద్ధి కావాలి. తండ్రి పట్ల మరియు తండ్రి ఇచ్చే ధనము పట్ల ఎంతో ప్రేమ కావాలి. కొందరైతే ధనమే తీసుకోరు. అరే, జ్ఞాన రత్నాలనైతే ధారణ చేయండి అని చెప్తే, నేనేమి చేయను, నేను అర్థం చేసుకోలేను అని అంటారు. అర్థం చేసుకోకపోతే నీ భాగ్యము అంతే. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఎవ్వరినీ ద్వేషించకూడదు. అందరితో మధురంగా వ్యవహరించాలి. జ్ఞాన-యోగాలలో రేస్ చేసి తండ్రి మెడలో హారముగా అవ్వాలి.

2. నిద్రను జయించేవారిగా అయ్యి ఉదయముదయమే లేచి తండ్రిని స్మృతి చేయాలి. స్వదర్శన చక్రాన్ని తిప్పాలి. ఏదైతే వింటారో, దానిపై విచార సాగర మంథనం చేసే అలవాటు చేసుకోవాలి.

వరదానము:- బుద్ధిని డైరెక్షన్ల అనుసారంగా శ్రేష్ఠ స్థితిలో స్థితి చేసే మాస్టర్ సర్వశక్తివాన్ భవ

కొంతమంది పిల్లలకు యోగములో కూర్చున్నప్పుడు ఆత్మాభిమానులుగా అయ్యేందుకు బదులుగా సేవ గుర్తుకొస్తుంది, కానీ అలా జరగకూడదు ఎందుకంటే చివరి సమయంలో ఒకవేళ అశరీరిగా అయ్యేందుకు బదులుగా సేవ యొక్క సంకల్పాలు నడిచినా కానీ, సెకెండు యొక్క పేపరులో ఫెయిల్ అయిపోతారు. ఆ సమయంలో తండ్రి తప్ప, నిరాకారీ, నిర్వికారీ, నిరహంకారీ తప్ప, ఇంకేదీ గుర్తు ఉండకూడదు. సేవలో ఎంతైనా సాకారంలోకి వచ్చేస్తారు. అందుకే ఈ అభ్యాసాన్ని చేయండి - ఏ సమయంలో ఏ స్థితిలో స్థితులవ్వాలి అనుకుంటే, అలా స్థితులవ్వాలి - అప్పుడు మాస్టర్ సర్వశక్తివాన్, కంట్రోలింగ్ మరియు రూలింగ్ పవర్ కలవారు అని అంటారు.

స్లోగన్:- ఎటువంటి పరిస్థితినైనా సహజంగా దాటేందుకు సాధనము - ఒకే బలము, ఒకే విశ్వాసము.